ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ : 24.02.2026 సమయం : 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. వచ్చేనెల 16 నుండి 30వ తేదీ వరకు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. మార్చి 20వ తేదీన ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో బడ్జెట్‌ను ప్రవేశపెడతారు.

2. భవన నిర్మాణాల్లో డిజిటల్ కనెక్టివిటీ, డిజిటల్ మౌలిక సదుపాయాలు కల్పించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, డిపార్ట్ మెంట్ ఆఫ్ టెలికాం అదనపు డైరెక్టర్ జనరల్ ఎం. నగేష్ రావు పిలుపునిచ్చారు.

3. ఆర్టీసీ సంస్థ విలీనం, కార్మికుల సమస్యలు, కార్మిక సంఘాల గుర్తింపు వంటి అంశాలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు.

4. సిద్దిపేట జిల్లాలో నిర్మించనున్న గౌరవెల్లి ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

**క్యాబినెట్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన నిన్న సాయంత్రం సుదీర్ఘంగా జరిగిన తెలంగాణ మంత్రివర్గ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధి, పాలనపరమైన అంశాలపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వచ్చేనెల 16 నుండి 30వ తేదీ వరకు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. మార్చి 20వ తేదీన ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో బడ్జెట్ ను ప్రవేశపెడతారు. మరోవైపు.. హైదరాబాద్ మెట్రో రైలును L&T నుండి పూర్తిగా ప్రభుత్వం స్వాధీనం చేసుకోనుంది. ఈ ప్రక్రియ పూర్తయ్యాక మెట్రో నిర్వహణ ప్రభుత్వ పరిధిలోకి వస్తుంది. ఇక, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పింఛనుదారులకు రెండు కొత్త పథకాలు అమలు చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రమాద బీమా, ఆరోగ్య పథకాలను ఆమోదిస్తూ... నిన్న రాత్రి జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. 1.20 కోట్ల రూపాయలతో ప్రమాద బీమా వర్తింప జేయడానికి, ఒక వెయ్యి 56 కోట్ల రూపాయల మూలనిధితో ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య పథకానికి క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. మరోవైపు.. వైద్య రంగంలో మార్పులు చేస్తూ తెలంగాణ వైద్య విధాన పరిషత్ పేరును డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ గా మార్చారు. రాజధాని హైదరాబాద్ పరిధిలో కాంప్రహెన్సివ్ రోడ్ మెయింటెనెన్స్ ప్రోగ్రామ్ (సీఆర్ఎంపీ) రెండో దశకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు ద్వారా 3 వేల 145 కోట్ల రూపాయలతో 1,142 కిలో మీటర్ల మేర ప్రధాన రహదారుల నిర్వహణను మెరుగుపరుస్తారు. 1965లో ఏర్పాటు చేసిన మంజీరా ఫేజ్-1, 1981లో వేసిన ఫేజ్-2 పైపులైన్ల స్థానంలో 772 కోట్ల రూపాయలతో కొత్త పైపులైన్ వేయనున్నారు. హైదరాబాద్ తాగునీటి సరఫరాలో కీలకమైన ఉస్మాన్ సాగర్ కాండ్యూట్ స్థానంలో 280 కోట్ల రూపాయలతో కొత్త పైపు లైన్ వేయనున్నారు. భూ కేటాయింపుల పరంగా ఖమ్మంలో టీటీడీకి 20 ఎకరాలు, మహబూబాబాద్‌లో జేఎన్‌టీయూ కళాశాలకు 70 ఎకరాలు కేటాయించారు. అలాగే, జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల నిర్మాణానికి స్థలాలు ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

**పిటిసి, హైదరాబాద్**

**ట్రాయ్ సదస్సు**

భవన నిర్మాణాల్లో డిజిట్ కనెక్టివిటీ, డిజిట్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ అమలు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, డిపార్ట్ మెంట్ ఆఫ్ టెలికాం అదనపు డైరెక్టర్ జనరల్ ఎం. నగేష్ రావు

పిలుపునిచ్చారు. ఈరోజు ట్రాయ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లో 'డిజిటల్ కనెక్టివిటీ - రేటింగ్ ఆఫ్ బిల్డింగ్స్' అనే అంశంపై నిర్వహించిన సెమినార్ కు ముఖ్య అతిథిగా హాజరైన నగేష్ రావు మాట్లాడుతూ... భవన నిర్మాణ దారులు వందశాతం మోడల్ బిల్డింగ్ కోడ్ అమలు చేయాలన్నారు. అదే విధంగా రానున్న కాలంలో వినియోగ దారుల శ్రేయస్సే లక్ష్యంగా పెట్టుకొని ఏ ప్లస్, ఏ ప్లస్ ప్లస్, త్రీ స్టార్ వంటి గ్రేడింగ్ విధానాలను ప్రవేశపెట్టాలని నగేష్ రావు సూచించారు. బిల్డర్లు నిర్మాణాల్లో నాణ్యత, పర్యావరణ హితం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ సదస్సులో ట్రాయ్ సలహాదారులు బి. ప్రవీణ్ కుమార్ స్వాగతోపన్యాసం చేశారు. ట్రాయ్ ప్రిన్సిపల్ అడ్వైజర్ పుష్పేంద్ర కుమార్, హైదరాబాద్ క్రెడాయ్ అధ్యక్షులు జైదీప్ రెడ్డి, ఐజీబీసీ నేషనల్ వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి సదస్సులో ప్రసంగించారు. సదస్సులో ప్రముఖ భవన నిర్మాణ సంస్థల ప్రతినిధులు, జీహెచ్ఎంసీ, డీటీసీపీ అధికారులు పాల్గొన్నారు.

**ఎంఎస్ఎం**

**పొన్నం**

ఆర్టీసీ సంస్థ విలీనం, కార్మికుల సమస్యలు, కార్మిక సంఘాల గుర్తింపు వంటి అంశాలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. సంస్థ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఒక్కొక్క అంశాన్ని క్రమంగా నెరవేరుస్తున్నామని అన్నారు. ఆందోళనలు, ప్రేరేపిత నిరసనల్లో పాల్గొనకుండా ఆర్టీసీ పురోగతికి కలిసికట్టుగా పని చేద్దామని మంత్రి పిలుపునిచ్చారు.

**బైట్ - పొన్నం ప్రబాకర్**

**జీఎస్**

**సీతక్క**

రాష్ట్రంలో అనాథ పిల్లలకు భరోసా కల్పిస్తూ ఉపాధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఎయిర్‌పోర్టు ఆపరేషన్లు, కార్గో గ్రౌండ్ హ్యాండ్లింగ్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగాలకు సిద్ధం చేయనున్నట్లు వెల్లడించారు. మూడేళ్ల లోపు

చిన్నారుల సంరక్షణ కోసం క్రెచ్ సెంటర్లను ఏర్పాటు చేసి, అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేస్తామని వివరించారు. అనాథ పిల్లలకు నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పనతో పాటు టీచర్లకు వృత్తి నైపుణ్యాల కోసం సీతక్క సమక్షంలో అధికారులు నిన్న జీఎంఆర్ ఏరో అకాడమీ, ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్, అజీమ్ ప్రేమ్‌జీ వర్సిటీ ప్రతినిధులతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ... ప్రభుత్వ సంరక్షణలో, శక్తి సదన్ లోని అనాథ యువతకు విమానయాన రంగంలో జీఎంఆర్ ఏరో అకాడమీ శిక్షణ ఇస్తుందన్నారు.

డెస్క్

**గౌరవెల్లి**

సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని గౌరవెల్లి ప్రాజెక్టుకు త్వరలో పర్యావరణ అనుమతులు రానున్నాయని నీటిపారుదల, రవాణా శాఖల మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుపై నిన్న సచివాలయంలో మంత్రులు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. లక్ష ఎకరాలకు పైగా సాగునీరు అందించే ఈ ప్రాజెక్టును త్వరలోనే న్యాయపరమైన అవాంతరాలు అధిగమించి పూర్తి చేస్తామన్నారు. భూ సేకరణకు అవసరమైన నిధులు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... భూ సేకరణకు సంబంధించి విధాన పరమైన నిర్ణయాలు న్యాయబద్ధంగా ఉండేలా చూడాలని సూచించారు.

డెస్క్

**వర్షాలు**

ఆసిఫాబాద్, నిర్మల్, నల్గొండ సహా పలు జిల్లాల్లో నిన్న రాత్రి కురిసిన అకాల వర్షాలతో అన్నదాతలు ఇబ్బందులు పడ్డారు. పత్తిలో తేమ శాతం పెరుగుతుందని మద్దతు ధర కోల్పోయే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్మల్ జిల్లాలోని పలు గ్రామాల్లో రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వర్షంతో చేతికి వచ్చిన మొక్కజొన్న పంట

నేల కొరిగింది. పలు పంటలు దెబ్బతిన్నాయి. ఆరబెట్టిన పసుపు పంట తడిసి పోయింది. నువ్వు పంట దెబ్బతింది.

**పీటీసీ – ఆసిఫాబాద్, నల్గొండ, నిర్మల్**

**ఇంటర్**

రేపటి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు 30 నిమిషాల ముందే రావాలని బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య సూచించారు. అయితే విద్యార్థులు ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా పరీక్ష హాల్ లోకి అనుమతిస్తామని చెప్పారు. ఈ ఏడాది 9 లక్షల 97 వేల 75 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని, మొదటి సంవత్సరంలో 4 లక్షల 89 వేల 126 మంది, రెండో సంవత్సరంలో 5 లక్షల 7 వేల 949 మంది ఉన్నారని వివరించారు. రాష్ట్రంలో మొత్తం 1,495 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద వైద్య శిబిరం ఉంటుందని, విద్యార్థులు ఒత్తిడి, ఆందోళనకు గురైతే టెలి-మానస్‌కు నేరుగా ఫోన్ చేయవచ్చని తెలిపారు.

**డెస్క్**

**<u>ఆక్రమణల తొలగింపు</u>**

ఖమ్మంలో పోలీసులు పలు ఆక్రమణలను తొలగిస్తున్నారు. వెలుగుమట్ల కలెక్టరేట్ సముదాయం సమీపంలోని 31 ఎకరాల భూదాన్ భూముల్లో సుమారు 500 కుటుంబాలు గుడిసెలు వేసుకుని నివసిస్తున్నాయి. అయితే అవి ప్రభుత్వ భూములని, ఖాళీ చేయాలని గతంలో అధికారులు  ఆక్రమణదారులకి నోటీసులు జారీ చేశారు. ఈ ప్రాంతానికి చెందిన తొమ్మిది మంది కోర్టుకు వెళ్లగా, వారివి తప్ప మిగతా ఇళ్లు కూల్చి వేస్తున్నారు. దీంతో నిర్వాసితులు, అధికారులకు  మధ్య తోపులాట జరిగింది. పోలీసుల సహకారంతో రెవెన్యూ సిబ్బంది పూరి గుడిసెల కూల్చివేత పనులు మొదలుపెట్టారు.

PTC, KMM

**ఉద్యోగం**

నిజామాబాద్ మాధవనగర్ వద్ద గత నెలలో గంజాయి స్మగ్లర్లు కారుతో ఢీ కొట్టడంతో చనిపోయిన ఎక్సైజ్ కానిస్టేబుల్ గాజుల సౌమ్య తమ్ముడు శ్రవణ్‌కు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ నియామక పత్రాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కలెక్టరేట్‌లో నిన్న అందించారు. గంజాయి ముఠా దాడిలో ప్రాణాలు కోల్పోయిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య కుటుంబానికి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని మంత్రి జూపల్లి కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు.

**డెస్క్**

**ట్రాక్టర్లు సీజ్**

హనుమకొండ, వరంగల్ లోని 8 పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న పలు ట్రాక్టర్లను సీజ్ చేసి సుమారు 42 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. దీనికి బాధ్యులైన 19 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**పీటీసీ - వరంగల్**

**సెంట్రల్ ఎక్సైజ్ దినోత్సవం**

దేశ వ్యాప్తంగా ఈరోజు సెంట్రల్ ఎక్సైజ్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. 1944 ఫిబ్రవరి 24న బ్రిటిష్ పాలనలో ఎక్సైజ్ సుంకాలకు సంబంధించిన చట్టం అమల్లోకి వచ్చిన జ్ఞాపకార్థం ఈ రోజును పాటిస్తారు. ఇది దేశ ఆర్థిక వ్యవస్థలో కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (CBIC) సిబ్బంది సేవలను గౌరవిస్తుంది. అలాగే, పన్ను చెల్లింపుపై ప్రజల్లో అవగాహనను పెంచుతుంది. సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్ అధికారుల సేవలను గుర్తించడం, దేశ అభివృద్ధిలో పన్నుల ప్రాముఖ్యతను తెలియజేయడం ఈరోజు ముఖ్య ఉద్దేశ్యంగా ఉది.

**జీఎస్**

**వాతావరణం**

హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఈరోజు ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది. అలాగే, జనగామ, జోగులాంబ గద్వాల, మహబూబ్ నగర్,

మేడ్చల్ మల్కాజిగిరి, నాగర్ కర్నూల్, నల్గొండ, నారాయణపేట, సంగారెడ్డి, సూర్యాపేట, వికారాబాద్, వనపర్తి, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఉరుములతో కూడిన వర్షాలు కురవొచ్చని పసుపు రంగు హెచ్చరికను జారీ చేసింది.

**పీఎస్**